
# నవతరం

— కొశ్శారి వాణీచలపతిరావు



ఆటో దిగి మౌనంగా లోపలికి వస్తున్న మమత మీద ఒక్కసారిగా విరుచుకుపడ్డారు. రాఘవ, కాత్యాయని.

"పిన్ని దగ్గరికి వెళుతున్నానని ప్రయాణమై వెళ్ళి నువ్వు చేసిన పని ఇదా? మాతో అబద్ధమాడి, మమ్మల్ని మోసం చేసి ఇంతపని చేయాలన్న బుద్ధి అసలు ఎలా పుట్టిందే నీకు?" కోపంతో కళ్ళు ఎర్రబడగా మమత వంక ఉరిమి చూస్తూ అన్నాడు రాఘవ.

ఇక కాత్యాయని పరిస్థితి అయితే వర్ణనాతీతంగా ఉంది. ఒక పక్క కోపంతో, ఆవేశంతో మనిషి వణికిపోతున్నది. మరో పక్క దుఃఖంతో గొంతు పూడుకొని పోయి ఏడుపు తప్ప నోట్లో నుండి మాటరావడం లేదు. గద్గదిక స్వరంలో నుండి ఎలాగయితేనేం చివరకు మాటలు అతికష్టం మీద బయటికి వచ్చాయి.

"ఒక్కగానొక్క కూతురివని గారాబంగా చూసుకుంటూ.... నువ్వు ఆడింది ఆటగా స్వేచ్ఛ ఇచ్చినందుకు మాకు బాగా బుద్ధి చెప్పావే. మా కూతురి మంచి, చెడుల విషయంలో కూడా మాకు ఎలాంటి హక్కు, ప్రమేయం లేవని ఈ లోకానికి చాటింపు వేసి మరీ చెప్పావు. మేము బ్రతికుండీ నీ దృష్టిలో చచ్చిన వాళ్ళతో సమానమయ్యాం కళ్ళవెంబడి కారిపోతున్న కన్నీటిని, పమిట చెంగుతో అద్దుకుంటూ అంది కాత్యాయని.

'ఆటోకు డబ్బులిచ్చిపంపేసి లోపలికి వస్తున్న రామకృష్ణ మమత వంక, ఆమెను మందలిస్తున్న కాత్యాయని, రాఘవల వంక చూస్తూ వాళ్ళ మాటలు వింటూ కాసేపు అలాగే నిల్చుండి పోయాడు. తలవంచుకొని నిల్చున్న మమత ను చూస్తుంటే కోపంతో పాటు అతనిలో జాలి కూడా కలిగింది.

"అసలు దీనికంతా కారణం వాళ్ళే వాళ్ళ స్వార్థంకోసం మమతను మభ్యపెట్టి వాడుకున్నారు. చిన్నపిల్ల, దానికేం తెలుసు? వాళ్ళ తియ్యటి మాటలకు లొంగిపోయి ఇంత పనికి తెగించింది. అందుకే వాళ్ళను నాలుగూ దులిపి వచ్చాను."

ఆ మాటలకు చటుక్కున తలెత్తి రామకృష్ణ వంక చూసింది మమత

"బాబాయ్! నీకు ఇందాకా చెప్పాను. మళ్ళీ చెబుతున్నాను. ఏమన్నా అనదలుచుకుంటే నన్ను అను. అంతేగానీ వాళ్ళను ఒక్కమాటన్నా నేను సహించను. నేను ఏ పని చేసినా నాకు నచ్చితేనే, నా ఇష్టంతోనే చేస్తాను గానీ ఎవరి బలవంతానికి లొంగికాదు"- అంది ప్రతిమాటలో ఆత్మవిశ్వాసం, దృఢసంకల్పం ధ్వనిస్తుండగా.

ఆ మాటలతో అగ్నిలో ఆజ్యం పోసినట్లయింది కాత్యాయనికి

"ఏమిటే! పెద్దా చిన్నా లేకుండా ఎదిరించి

మాట్లాడుతున్నావ్? నీకు ఇష్టమైన పని అయితే అది ఏదైనా మాకు చెప్పకుండా చేస్తావా? మా చిన్నప్పుడు మాకు తల్లిదండ్రులంటే ఎంత భయభక్తులుండేవి. ఇరుగింటికి పొరుగింటికి ఆడుకోవటానికి వెళ్ళినా ఇంట్లో చెప్పి పెద్దవాళ్ళు పొమ్మన్న తర్వాతే పోయే వాళ్ళం. ఈ రోజుల్లో ఈ నడమంత్రపు చదువులు, సినిమాలు, నవలలు వచ్చి ఆడపిల్లలను కూడా ఆడుపాట్లలలో లేకుండా తయారు చేస్తున్నాయి..."

"ఏదో తప్పు చేసినట్లు ఎందుకమ్మా... అలా నిలదీసి అడుగుతున్నారు? ఇప్పుడేం జరిగిందని? ఏదో కొంపలంటుకొని పోతున్నట్లు ఎందుకలా రాద్ధాంతం చేస్తున్నారు...." నొసలు చిట్లించి చిరాకుపడుతూ అంది మమత. ఆశ్చర్యంతో బుగ్గలు నొక్కుకుంటూ అంది కాత్యాయని-

"ఇంత చేసి ఇంకా ఏం జరిగింద'ని అడుగుతున్నావా? ఏ లోపం లేకపోయినా, ఎంత మంచి లక్షణాలున్నా ఈ రోజుల్లో ఆడపిల్లలకు పెళ్ళిళ్ళు కావటం కష్టంగా ఉంది. ఇప్పుడు ఈ విషయం తెలిస్తే నిన్ను ఎవడైనా పెళ్ళి చేసుకోవటానికి ముందుకొస్తాడా అసలు?"

"రాకపోతే వచ్చిన నష్టమేమీ లేదు. నా మనసు తెలుసుకోగలిగిన వాడు వచ్చినప్పుడే చేసుకుంటాను. లేకుంటే జీవితాంతం ఇలాగే ఉండిపోతాను. అంతేగానీ నా వ్యక్తిత్వాన్ని చంపుకుని నేను క్షణం కూడా బ్రతకలేను..." దృఢనిశ్చయంతో అంది మమత.

అంత వరకూ ఆ తల్లీ కూతుళ్ళ సంభాషణను మౌనంగా వింటున్న రాఘవలో ఇక సహనం చచ్చిపోయింది.

"ఎంతసేపూ .... నేను.... నేను అంటూ నిన్ను గురించి నువ్వే మాట్లాడతావు గానీ... మేము ఒకళ్ళం ఉన్నామని గుర్తించవేమే నువ్వు? రేపు నీకు పెళ్ళి కాకపోతే లోకం మమ్మల్ని చూసి నవ్వుతుంది. నిన్ను కనిపెంచిన మాకు కూడా నీ మీద హక్కులు, ఆశలు ఉంటాయని నువ్వే మాత్రం గుర్తించడం లేదు. పైగా 'నా జీవితం, నా ఇష్టం' అన్నట్లు మాట్లాడుతున్నావు."

"నేను అలా అనలేదు నాన్నా! మీరు పొరపాటు పడుతున్నారు. కనిపెంచిన తల్లిదండ్రులను కాదనే కృతఘ్నురాలిని కాదు నేను -" కళ్ళల్లో కన్నవారి పట్ల ప్రేమ పెల్లుబుకుతుండగా అంది మమత.

"కానప్పుడు ఇంట్లో అమ్మకు పిన్నివాళ్ళ ఊరికి వెళుతున్నానని చెప్పి అక్కడి కెందుకెళ్ళావ్? ఈ రోజు అనుకోకుండా బాబాయి వచ్చి నువ్వు అక్కడ లేవని చెబితే మేము ఎంత ఖంగారు పడ్డామో ఎంత మనోక్షోభ అనుభవించామో నీకేం తెల్సు...." కళ్ళల్లో గిర్రున నీళ్ళు తిరుగుతుండగా అన్నాడు రాఘవ.

ఉదయం నుండి తండ్రి తనకోసం పడిన బాధ అతని ముఖంలోని ప్రతి అణువులో వ్యక్తమవుతూ ఉంటే తనూ నొచ్చుకుంటూ అంది మమత.

"మిమ్మల్ని బాధపెట్టినందుకు క్షమించండి నాన్నా. ముందుగా చెబితే నేను చేయబోయే ఈ పనిని మీరు ఏ మాత్రం అంగీకరించరని నాకు తెల్సు. అందుకే వచ్చాక చెప్పొచ్చునని చెప్పలేదు. అనుకోకుండా ఈ రోజు బాబాయి రావడం వల్ల మీకు ఇంత మనస్తాపం కలిగింది." అంది మమత బాధ, క్షమాపణ ప్రతిమాటలో వ్యక్తమవుతుండగా.

కోపం, దుఃఖం - తీవ్రత కాస్త తగ్గిన కాత్యాయని కూతురి దగ్గరగా వచ్చి భుజం చుట్టూ చేయివేసి ఆప్యాయంగా దగ్గరికి తీసుకుంటూ, "అమ్మా! మమతా! నీ కంట్లో నలుసుపడ్డా, నీ కాలులో ముల్లు గుచ్చుకున్నా నా ప్రాణం విలవిలలాడిపోయేది అలాంటిది నువ్వు ఇప్పుడు చేసిన పనికి నా హృదయం ఎంతగా బద్దలై పోతున్నదో నీకెలా చెప్పను?" అంది గొంతుకు దుఃఖం అడ్డుపడుతూ ఉండగా.

"అమ్మా! నాకు చిన్న కష్టం వచ్చినా నీ ప్రాణం విలవిలలాడిపోతుందన్నావు. నీ లోని ఈ 'అమ్మ మనసు'తో మరో 'అమ్మ మనసు'ను అర్థం చేసుకోవటానికి ఎందుకు ప్రయత్నించటం లేదు నువ్వు? ప్రాణాపాయస్థితిలో ఉన్న స్వాతి ని నిస్సహాయంగా చూస్తూ ఆ తల్లి దండ్రులు రోజు ఎంతగా కృశించి పోయేవాళ్ళో తల్లి మనసుతో నువ్వు ఊహించలేవా? స్వాతి నా స్నేహితురాలు. చాలాగా తనూ తన తల్లిదండ్రులకు ఏకైక గారాబాల పట్టి. మధ్య తరగతి ఆర్థిక ఇబ్బందుల మధ్య నలుగుతూకూడా వేలకు వేలు ఖర్చు పెట్టించి దానికి వైద్యం చేయించారు. మరి కొన్ని వేలు ఖర్చుపెట్టి దానికి 'కిడ్నీ' కొని పెట్టడానికి కూడా సిద్ధంగా ఉన్నారు. అయినా దానిది చాలా రేర్ బ్లడ్ గ్రూప్ కావటంతో మ్యాచ్ అయ్యే కిడ్నీ ఎక్కడా దొరకలేదు. దాని అదృష్టం, నా సంకల్పబలం కలిసి వచ్చి నా కిడ్నీ దానికి సరిపోయింది. మీకు చెబితే ఎలాగూ ఒప్పుకోరని 'పిన్నివాళ్ళ ఊరికి' అని అబద్ధం చెప్పి హాస్పటల్‌లో జాయిన్ అయ్యాను. నేను చేసింది తప్పా అమ్మా!"

అంత చిన్నవయసులో అంత గొప్ప పని చేసి 'నేను చేసింది తప్పా అమ్మా!' అని దీనంగా అడుగుతున్న మమతను చూస్తుంటే ఏం సమాధానం చెప్పాలో అర్థం కాలేదు కాత్యాయనికి. మాటలు దొరకక మూగదానిలా ఉండిపోయిన భార్యను గమనించి రాఘవ తనే అన్నాడు.

"నువ్వు చేసింది తప్పని మేము అనటం లేదు మమతా. స్వాతి తల్లిదండ్రుల మనస్థితిని మేము అర్థం చేసుకోగలం. కానీ మా మాట ఏమిటి? మా బిడ్డ 'మంచి' ని గురించి మేం ఆలోచించటం మాత్రం తప్పా?"

"ఒక్కోసారి పరిస్థితులను బట్టి మనిషి తన స్వార్థాన్ని కొంచెమైనా తగ్గించుకోక తప్పదు నాన్నా! అలా చేయలేనప్పుడు ఇక మనిషి జన్మకు సార్థకత ఏముంది? అయినా ఇప్పుడు నాకు వచ్చిన ప్రమాదం ఏముంది? ఒక 'కిడ్నీ' ఇచ్చినా మరో 'కిడ్నీ' ఉంది నాలో. శరీరంలో తనవంతు పని తను చేయటానికి ఒక 'కిడ్నీ' చాలు. ఆపదలో ఇలా తనకో, ఇతరులకో ఉపయోగపడుతుందనే ఆ దేవుడు ముందు చూపుతో అవసరం లేకపోయినా మరో 'కిడ్నీ'ని మన శరీరంలో అమర్చాడు. నా శరీరంలోని ఒక చిన్న భాగం నా స్నేహితురాలి జీవితాన్ని నిలబెట్టగలదని తెలిసిన మరుక్షణం నుండే నా మనసు ఒక నిర్ణయానికి వచ్చేసింది. తాత్కాలికంగా ఎదురయ్యే ఆటంకాలు, అవరోధాలు 'నూరేళ్ళ ఒక జీవితం' ముందు నాకు చాలా స్వల్పంగా కనిపించాయి. అందుకే మిమ్మల్ని ఎదిరించే ఈ సాహసం చేసాను" అంది మమత తల్లిదండ్రుల ముఖాల వంక మార్చి మార్చి చూస్తూ.

## మహిళా హక్కుల రక్షణ మహాసభ

సమాజంలో సమస్యలేమో అనంతంగా వున్నాయి. కుల, మత భేదం లేకుండా మహిళలందరూ అత్యాచారాలకు గురి అవుతున్నారు. వరకట్నం, బాల్య వివాహాలు కొన్ని, వేర్వేరు చట్టాల స్థానే స్త్రీలపై జరుగుతున్న అత్యాచారాలన్నింటినీ నిరోధించడానికి ఒకే చట్టాన్ని కామన్ సివిల్ కోడ్ రూపొందించాలని, స్త్రీలకు సర్వరంగాలలో అభివృద్ధి సాధించడానికి ఏఏ చర్యలు తీసుకోవాలో తెలుసుకుని వాటిని అమలు పరచాలనే వుద్దేశ్యంతో కేంద్ర ప్రభుత్వం ఇటీవల జాతీయ మహిళా కమీషన్‌ను స్థాపించిందని యిటీవల హైదరాబాద్ వికాస కేంద్రంలో జరిగిన మహిళా హక్కుల రక్షణ సభను ప్రారంభిస్తూ జాతీయ మహిళా కమీషన్ సభ్యురాలు శ్రీమతి పద్మా సేత్ అన్నారు. ఈ కమీషన్ గురించి ఒక ఛైర్ పర్సన్, ఒక సెక్రటరీ, ఐదుగురు సభ్యులు కలిసి మొత్తం ఏడుగురు వుంటారని వివరించారు. ప్రభుత్వం ఇప్పటికే ప్రవేశపెట్టిన మహిళాభివృద్ధి కార్యక్రమాలు ఆయా సంస్థలు సక్రమంగా అమలు పరుస్తున్నాయా లేదా అని గమనించి వాటిని ప్రశ్నించే హక్కు ఈ కమీషన్‌కు వుంది. అలాగే శాసనాలలో వున్న లోపాలు గమనించి వాటిని తొలగించడానికి ఏమి చేయాలి అని కమీషన్ సూచించవచ్చు అన్నారు. ఇంకా సివిల్ కోర్టుకు ఎన్ని అధికారాలున్నాయో అవన్నీ ఈ కమీషన్‌కు వున్నాయి. అయితే ఒక వైపు ప్రజలు, మరొకవైపు స్వచ్ఛంద సంస్థలు ఒకటిగా నిలబడి తమ సహాయ సహకారాలు అందించినప్పుడే ఈ కమీషన్ సమర్థవంతంగా అనుకున్న లక్ష్యాలను సాధించగలుగుతుంది అన్నారామె.

- డి. స్వాతి

ఈసారి
**వనిత**
దీపావళి ప్రత్యేక సంచికగా
ఎక్కువ పేజీలతో–మరిన్ని వర్ణచిత్రాలతో
పదితలు పదికాలాలపాటు చదివి దాచుకుని చదివే
విధంగా వెలువడుతోంది.
పూర్తి వివరాలు వచ్చే సంచికలో!

తమ చేతుల్లో ఆడుకుని, తమ కళ్ళ ముందు పెరిగి పెద్దయిన కూతురు తమకే 'మంచి'ని మానవత్వాన్ని బోధిస్తుంటే అంత గొప్ప వ్యక్తిత్వం ముందు వామనుల్లా కుంచించుకుని పోతున్న అనుభూతి'ని పొందారు రాఘవ కాత్యాయని. ఆమె త్యాగగుణం ముందు తమ స్వార్థం ఎప్పుడో తోకముడిచినట్లు అప్పుడే వాళ్ళకూ తెలిసింది.

తల్లిదండ్రుల కళ్ళకు పిల్లలెప్పుడూ చిన్నపిల్లలు గానే కనిపిస్తారు. కానీ పిల్లలకూ పెద్ద మనసుంటుంది. వాళ్ళూ ఆలోచించగలరు. స్వయంగా నిర్ణయాలు తీసుకోగలరు. తమ నిర్ణయాలకు ఎవరైనా అడ్డు తగిలితే వాళ్ళను ఎదిరించగలరు కూడా. ఈ విషయాలను అర్థం చేసుకోలేని పెద్దలే పిల్లల మీద అధికారం చెలాయించాలని చూస్తారు. వాళ్ళ మనసుతో వాళ్ళను ఆలోచించనీయకుండా తమ మనసుతో ఆలోచించమని బలవంతం చేస్తారు. వాళ్ళ ఇష్టాయిష్టాలకు వాళ్ళను వదిలి వేయకుండా తమ అభిప్రాయలను వాళ్ళ మీద రుద్దాలని ప్రయత్నం చేస్తారు. దాంతో తరాల అంతరం మధ్య హక్కుల పోరాటం ఆరంభమవుతుంది. అప్పుడు ప్రతి ఇల్లూ ఒక 'యుద్ధభూమి' అవుతుంది. అలా కాకుండా శాంతి, సుఖాలతో మనిషి జీవించాలంటే, ప్రతి ఇల్లూ ఒక ఆనంద నిలయం కావాలంటే కావాల్సింది మనిషికీ మనిషికీ మధ్య అవగాహన. అది లేనప్పుడే కుటుంబంలో, సమాజంలో సమస్యలు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తాయి.

'మమత మాటల్లోని మంచి, వాస్తవం గుర్తించాక కాత్యాయని, రాఘవల మనసులు తేలికపడ్డాయి. ఆవేశం, కోపం చప్పగా చల్లారిపోయి వాటి స్థానంలో ఆనందం, గర్వం చోటు చేసుకున్నాయి.

"అమ్మా! నిజానికి స్వాతి వాళ్ళ అమ్మా, నాన్న తమ కూతురి గురించికన్నా ఎక్కువగా నన్ను గురించి ఆలోచించారు. నా తల్లిదండ్రులుగా మీ నుండి ఇలాంటి అభ్యంతరం వస్తుందని ఊహించే నన్ను ఎంతగానో వారించారు. వాళ్ళను ఒప్పించడం నాకు చాలా కష్టమైపోయింది. మీరనుకున్నట్లు తమ బిడ్డ ప్రాణాలకోసం మరో అమ్మ కన్న బిడ్డ ప్రాణాలకు, ముప్పుతెచ్చే వాళ్ళు కాదమ్మా వాళ్ళు." అంది మమత నచ్చ చెప్పే ధోరణిలో.

అప్పటికేపశ్చాత్తాపపడుతున్న మమత బాబాయి రామకృష్ణ ఆ మాటలకు మరింత నొచ్చుకున్నాడు. "నిజంగా ఇందాకటి నా ప్రవర్తనకు ఇప్పుడు నేను సిగ్గుపడుతున్నాను మమతా. వెంటనే వెళ్ళి వాళ్ళకు క్షమాపణ చెప్పుకోకపోతే నాకు మనశ్శాంతి ఉండదు." అన్నాడు చిన్నబోయిన ముఖంతో.

"ప్రత్యక్షంగా నువ్వు బాధపడితే పరోక్షంగా మేమూ వాళ్ళను బాధపెట్టాం. వాళ్ళకు క్షమాపణ చెప్పుకోవలసిన బాధ్యత మాకూ ఉంది" అన్నాడు రాఘవ మనస్ఫూర్తిగా.

"పదండి. నేనూ వస్తాను. స్వాతిని చూసి, వాళ్ళ తల్లిదండ్రులను పలకరించినట్లు ఉంటుంది" అంది కాత్యాయని అప్పుడే బయలుదేరే ఉద్దేశంతో.

అంతా కల్సి స్వాతిని చూడటానికి వెళ్ళారు.

"ఆంటీ! వీళ్ళిద్దరూ మా అమ్మా, మా నాన్న." అని స్వాతి తల్లిదండ్రులకు పరిచయం చేసింది మమత.

ఆ మాట వింటూనే ఆమె ఉద్విగ్నతతో వచ్చి కాత్యాయనిని కౌగిలించుకుని కళ్ళనీళ్ళు పెట్టుకుంది. "మీకెలా కృతజ్ఞతలు చెప్పుకోవాలో నాకు అర్థం కావటం లేదు. నా బిడ్డకు ప్రాణాలు పోయటానికే మమత మీ కడుపున పుట్టిందనిపిస్తుంది నాకు. అంతటి త్యాగమూర్తిని కన్నందుకు ఏమి ఇచ్చినా మీ ఋణం తీర్చుకోలేము." అంది మనసంతా నిండిన కృతజ్ఞతా భావంతో.

స్వాతి తండ్రి, రాఘవ రెండు చేతులూ తన చేతుల్లోకి తీసుకుని కళ్ళకద్దుకున్నాడు.

ఆ దృశ్యం చూడగానే ఆ దంపతుల గుండె చెరువయింది. ఆ సమయంలో మమత తమ కూతురై పుట్టినందుకు మనసు గర్వంతో గంతులు వేసినా, ఇందాకటి తమ మాట తీరు, ప్రవర్తన గుర్తుకువచ్చి అంతలోనే కుంచించుకొనిపోయారు.

"నన్ను మీరు క్షమించాలి. ఇందాకటి నా ప్రవర్తనకు, నా మాట తీరుకు నేను సిగ్గుపడుతున్నాను" అన్నాడు రామకృష్ణ చిన్నబోయిన ముఖంతో.

"మీరు సిగ్గుపడాల్సిన అవసరం ఎంత మాత్రం లేదు. ఎవరైనా తమ పిల్లల సుఖాన్ని, క్షేమాన్ని కోరుకుంటారు గనుక మీ పరిస్థితిలో ఎవరున్నా అలాగే మాట్లాడతారు." అన్నాడు స్వాతి తండ్రి మనస్ఫూర్తిగా .

"మమత తో నేనూ అదే చెప్పాను. ఆడపిల్లవు రేపు నీ పెళ్ళికి ఇదో అభ్యంతరం అవుతుంది వద్దమ్మా! అంటే మమత ఏమందో తెల్సా? 'ఒక పక్క ఒక ప్రాణి చనిపోయే పరిస్థితిలో ఉంటే మీరు పెళ్ళి గురించి మాట్లాడతారేం ఆంటీ? నేను చేసిన పని మంచిది కాదని ఎవరైనా అంటే అసలు అలాంటి పెళ్ళికొడుకుతో నాకు పెళ్ళే వద్దు. సంస్కారం, మంచిని హర్షించే సభ్యతలేని జీవిత భాగస్వామిని నేను మాత్రం జీవితమంతా ఎలా భరించగలను? ఒక మంచి వ్యక్తిని భర్తగా ఎన్నుకోవటానికి నేను చేసిన ఈ కిడ్నీ దానమే ఒక పరీక్షగా ఉపయోగపడి నాకుమేలు చేస్తుంది ఆంటీ" అన్నది స్వాతి తల్లి మమత వంక మెచ్చుకోలుగాచూస్తూ.

"ఈ కాలం పిల్లలు చిన్నతనంలోనే ఎంతగానో ఎదిగిపోతున్నారు. మనమే వాళ్ళ ముందు తలవంచుకోవలసిన పరిస్థితి వస్తున్నది ఒక్కోసారి. కాల మహిమో, సృష్టిమాయోగానీ ఈతరం పిల్లలు పుడుతూనే తమకంటూ వ్యక్తిత్వాన్ని సంతరించుకుని తమ మంచి చెడుల గురించి తామే ఆలోచించుకోవటం తమ నిర్ణయాలు తామే తీసుకోవటం చేస్తున్నారు" అంది, కాత్యాయని నవతరం మీద అభిమానం, గర్వం తొణికిసలాడుతుండగా.

"ఈ సమయంలో పెద్దలుగా మనం చేయాల్సిన పని ఒక్కటే ఉంది. వాళ్ళ నిర్ణయాలకు వాళ్ళను వదిలేస్తూ వాళ్ళ పనికి అడ్డుతగలకుండా ఉండటం" అన్నాడు రాఘవ పెద్దల తరపు నుండి నాయకత్వం వహిస్తూ.

"అక్షరలక్ష విలువచేసే మాటన్నారు." అన్నాడు స్వాతి తండ్రి రాఘవకు వంత పలుకుతూ. వాళ్ళ మాటలకు ఆడవాళ్ళిద్దరూ ముఖాముఖాలు చూసుకుని నవ్వుకున్నారు.

శ్రోతగా మిగిలిపోయిన మమత, బాబాయి మెచ్చుకోలు చూపులు కూడా ఆ మాటలకు తోడు కావడంతో స్వాతితో కళ్ళతోనే ఏదో మాట్లాడేసి చిరుదరహాసం చేసింది. ఈ కాలం పిల్లల్ని ఆ మనసు భాష అక్కడున్న పెద్దలకు అర్థమయ్యీ కానట్లుగా అనిపించింది. కారణం ఆ 'భాష'కు భావం, భాష్యం అన్నీ చెప్పవలసింది చెప్ప గలిగిందీ పిల్లలే గనుక.